అపోలో లాభం రూ. 372 కోట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 10:అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.372 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది సంస్థ. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.245 కోట్ల లాభంతో పోలిస్తే 52 శాతం ఎగబాకింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.4,851 కోట్ల నుంచి రూ.5,527 కోట్లకు ఎగబాకింది. వచ్చే మూడు నుంచి నాలుగేండ్లకాలంలో కొత్తగా 11 ప్రాంతాల్లో ఆసుపత్రులను ఏర్పాటు చేయడం ద్వారా కొత్తగా 3,512 పడకలు జతకానున్నాయని అపోలో హాస్పిటల్స్ చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి తెలిపారు. ముంబై నుంచి వారణాసి, చెన్నై నుంచి గురుగ్రామ్ వరకు ఉత్తమ వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. మరోవైపు, రూ.5 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.9 లేదా 180 శాతం మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ప్రకటించింది.

PATANJALI
PATANJALI FOODS LIMITED

పతంజలి ఫుడ్ ఆకర్షణీయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.370.93 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది పతంజలి ఫుడ్స్ లిమిటెడ్. 2023–24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.216.54 కోట్ల లాభంతో పోలిస్తే 71.29 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం కూడా రూ.7,910.70 కోట్ల నుంచి రూ.9,103.13 కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. నిర్వహణ ఖర్చులు కూడా రూ.8,652.53 కోట్లకు ఎగబాకాయి

గోల్డ్ హై జంప్

ఒక్కరోజే రూ.2,430 ఎగిసిన తులం ధర

ఆల్‌టైమ్ హైని తాకుతూ రూ.88,500కు చేరిక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: బంగారం ధరలు భారీగా పెరిగాయి. ఆల్‌టైమ్ హైలో స్థిరపడ్డాయి. సోమవారం ఒక్కరోజే దేశీయ మార్కెట్‌లో దాదాపు రెండున్నర వేలు పుంజుకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల హెచ్చరికలు.. స్టాక్, ఫారెక్స్ మార్కెట్లతోపాటు బులియన్ మార్కెట్‌నూ షేక్ చేసేశాయి మరి. ఈ క్రమంలోనే ఢిల్లీలో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల ధర రూ.2,430 ఎగబాకి మునుపెన్నడూ లేనివిధంగా రూ.88,500ను తాకింది. ఈ మేరకు అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలియజేసింది.

ఇదీ సంగతి..

అగ్రరాజ్యంలోకి దిగుమతయ్యే ఉక్కు, అల్యూమినియంలపై 25 శాతం సుంకాలు వేస్తామని ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఈక్విటీ మార్కెట్లు కుదేలవగా.. బంగారం, వెండి తదితర కమోడిటీ మార్కెట్లు పరుగులు పెట్టాయి. ఈ నేపథ్యంలోనే స్పాట్ మార్కెట్లలో ఔన్స్ గోల్డ్ విలువ రికార్డు స్థాయిలో 2,900 డాలర్లు పలికింది. కోమెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లోనూ రూ.2,932.69 డాలర్లుగా ట్రేడైంది. త్వరలోనే 3,000 డాలర్లు పలికినా ఆశ్చర్యపోనక్కర్లేదన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ఇక సిల్వర్ ఔన్స్ 32.76 డాలర్లను చేరింది. ఈ ట్రెండ్ దెబ్బకు భారతీయ మార్కెట్లలోనూ హోల్‌సేల్, రిటైల్ నగల వ్యాపారుల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ కనిపించింది. ఫలితంగా ఒక్కసారిగా రేట్లు పైపైకి పోయాయి. నిజానికి గతకొద్ది రోజులుగా గోల్డ్ మార్కెట్ దూకుడు మీదనే ఉన్నది. స్టాక్ మార్కెట్ల ఒడుదొడుకుల నడుమ ఇన్వెస్టర్లు.. సురక్షిత పెట్టుబడి సాధనమైన పసిడి వైపే అడుగులు వేస్తున్నారు. అయితే ట్రంప్ దుందుడుకు నిర్ణయాలతో వాణిజ్య యుద్ధానికి అవకాశాలుండటంతో పుత్తడి ధరలు రాబోయే రోజుల్లో మరింత పెరిగే వీలే ఉన్నదంటున్నారు మార్కెట్ విశ్లేషకులు. దీంతో మదుపరులు గోల్డ్‌పై ఇంకా ఇన్వెస్ట్‌మెంట్లు పెట్టవచ్చని అంచనా వేస్తున్నా రు. అదే జరిగితే సరికొత్త శిఖరాలను ధర లు అధిరోహించడం ఖా యమేనన్న అభిప్రాయాలు గట్టిగా వినిపిస్తున్నాయి ప్పుడు.

హైదరాబాద్‌లో..

దేశ రాజధానిలో ధరలతో పోల్చితే హైదరాబాద్ మార్కెట్‌లో రేట్లు ఒకింత స్థిరంగానే ఉన్నట్టు కనిపిస్తున్నాయి. తులం 24 క్యారెట్ గోల్డ్ రేటు రూ.87,060గా ఉన్నది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) పసిడి ధర రూ.79,800గా నమోదైంది. గతంతో పోల్చితే వరుసగా రూ.390, రూ.350 చొప్పున పెరిగాయి. ఇక ఢిల్లీలో కిలో వెండి ధర రూ.97,500గా ఉన్నది. మునుపటితో చూస్తే రూ.1,000 పెరిగింది. ఇక ఎంసీఎక్స్‌పై ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో గోల్డ్ కాంట్రాక్ట్స్ ఏప్రిల్‌కుగాను 10 గ్రాములు రూ.940 పెరిగి రూ. 85,828గా నమోదైంది. జూన్‌కు రూ.1,015 ఎగిసి రూ.86,636గా ఉన్నది.

త్వరలో తులం లక్ష?

బంగారం ధరలు పెరుగుతున్న తీరును చూస్తే తులం లక్ష రూపాయలను తాకే సమయం ఎంతో దూరంలో లేదనిపిస్తున్నది. రేపటి రోజుల్లో పసిడి ధరలు మరింత పెరుగుతాయంటున్న మార్కెట్ నిపుణులు.. ఈ ఏడాది చివర్లో దేశీయ విపణిలోనే 10 గ్రాములు లక్ష రూపాయల మార్కును తాకినా ఆశ్చర్యపోనవసరం లేదని చెప్తున్నారు మరి. అయితే గ్లోబల్ మార్కెట్‌లోనూ ఔన్స్ 2,900 డాలర్ల మార్కును దాటడం ఈ అంచనాలకు బలం చేకూరుస్తున్నది. మొత్తానికి ఈ ఏడాది ధరల స్థిరీకరణకు అవకాశాలు తక్కువేనన్న మాట మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ నుంచి వినిపిస్తున్నది.

రిలయన్స్ స్పోర్ట్స్ డ్రింక్స్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:రిలయన్స్ గ్రూపునకు చెందిన రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ తాజాగా స్పోర్ట్స్ హైడ్రేషన్ డ్రింక్ సెగ్మెంట్‌లోకి ప్రవేశించింది. ప్రముఖ శ్రీలంక క్రికెటర్ ముత్తయ్య మురళీధరన్‌తో కలిసి స్పిన్నర్ పేరుతో ఈ డ్రింక్‌లను మార్కెట్లోకి విడుదల ఏసింది. ఇప్పటికే కంపా కొలా పేరుతో కూల్‌డ్రింక్స్‌ను విక్రయిస్తున్న సంస్థ తాజాగా విడుదల చేసిన 150 ఎంఎల్ సింగిల్–సర్వ్ బాటిల్ కలిగిన స్పోర్ట్స్ డ్రింక్ ధర రూ.10గా నిర్ణయించింది. ఇతర పోటీ సంస్థలైన పెప్సీకో, కోక–కోలాకు చెందిన స్పోర్ట్స్ డ్రింక్స్ కంటే తక్కువ ధరతో విడుదల చేయడం విశేషం.

టాటా బోయింగ్ 300వ ఫ్యూజ్‌లేజ్

హైదరాబాద్, ఫిబ్రవరి 10: టాటా బోయింగ్ ఏరోస్పేస్ లిమిటెడ్ హైదరాబాద్ యూనిట్ నుంచి ఏహెచ్–64 అపాచీ అటాక్ హెలిక్యాప్టర్ కోసం మరో బాడీని డెలివరీ చేసింది. ఈ ఫ్యూజ్‌లేజ్ 300వది కావడం విశేషం. ఇక ఈ హెలిక్యాప్టర్లను అమెరికా ఆర్మీతోపాటు భారత ఆర్మీ కూడా వినియోగిస్తున్నది. దేశీయ ఎయిర్‌ఫోర్స్ 22 ఏహెచ్–64ఈ అపాచీ హెలిక్యాప్టర్లను కలిగివున్నది. బోయింగ్, టీఏఎస్‌ఎల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌లో 900 మంది ఇంజినీర్లు, టెక్నీషన్లు ఉన్నారు. 14 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌లో తయారైన ఉత్పత్తులు ఇతర దేశాలకూ ఎగుమతి అవుతున్నాయి.

ట్రంప్ టారీఫ్‌ల దెబ్బ

సెన్సెక్స్ 548, నిఫ్టీ 178 పాయింట్ల పతనం

ముంబై, ఫిబ్రవరి 10: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగోరోజూ భారీగా నష్టపోయాయి. అమెరికా దిగుమతి చేసుకునే అల్యూమినియం, స్టీల్‌పై 25 శాతం సుంకం విధిస్తామని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు మార్కెట్లపై పిడుగుపడ్డట్టు అయింది. మదుపరుల్లో నమ్మకం సడలడంతో అమ్మకాల బటన్ నొక్కారు. బ్లూచిప్ సంస్థల షేర్లతోపాటు బ్యాంకింగ్, మెటల్, చమురు రంగ షేర్లు కుదేలవడం సూచీల పతనానికి ఆజ్యంపోసింది. ఇంట్రాడేలో 750 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 548 పాయింట్లు నష్టపోయి 77,311.80 పాయింట్ల వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ కూడా 178.35 పాయింట్లు కోల్పోయి 23,381.60 వద్ద స్థిరపడింది. అమెరికా టారిఫ్ భయాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయని, దేశీయ మదుపరులు తమ పెట్టుబడులను ఈక్విటీల నుంచి సురక్షితమైన బంగారం వైపు మళ్లించడం కూడా పతనానికి పరోక్షంగా కారణమయ్యాయని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

టాప్ లూజర్‌గా పవర్‌గ్రిడ్

నిరుత్సాహక ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో పవర్‌గ్రిడ్ షేరు భారీగా పతనం చెందింది. ఒక దశలో నాలుగు శాతానికి పైగా నష్టపోయిన షేరు చివరకు 3.45 శాతం నష్టంతో రూ.268.70 వద్ద ముగిసింది. దీంతోపాటు టాటా స్టీల్, జొమాటో, టైటాన్, బజాజ్ ఫైనాన్స్, ఎన్‌టీపీసీ షేర్లు కూడా రెండు శాతానికి పైగా మార్కెట్ వాటాను కోల్పోయాయి. అలాగే మహీంద్రా, టాటా మోటర్స్, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, మారుతి, రిలయన్స్, ఇండస్ఇండ్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు ఒక్క శాతానికి పైగా నష్టపోయాయి. వీటితోపాటు సన్‌ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, అదానీ పోర్ట్స్, ఎల్‌అండ్‌టీ, నెస్లె, ఎస్బీఐ షేర్లు పతనం చెందాయి. కానీ, కొటక్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టీసీఎస్, హెచ్‌యూఎల్ షేర్లు లాభాల్లో ముగిశాయి. బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ 2.25 శాతం తగ్గగా, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.06 శాతం క్షీణించాయి. రంగాలవారీగా చూస్తే రియల్టీ రంగ సూచీ అత్యధికంగా 2.69 శాతం నష్టపోగా, మెటల్ 2.63 శాతం, కన్జ్యూమర్ డ్యూరబుల్ 2.61 శాతం, యుటిలిటీ 2.49 శాతం దిగువకు పడిపోయాయి.

నష్టాలకు కారణాలు ఇవే

- అమెరికా దిగుమతి చేసుకునే స్టీల్, అల్యూమినియంపై 25 శాతం సుంకాల ప్రకటన
- దేశీయ మార్కెట్లో విదేశీ మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపడం
- రూపాయితో పోలిస్తే డాలర్ మరింత బలపడటం
- దేశీయ కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలు

నాలుగు రోజుల్లో 7.68 లక్షల కోట్లు ఆవిరి

స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతుండటంతో లక్షల కోట్ల రూపాయల మదుపరుల సంపద కరిగిపోతున్నది. ఎఫ్ఐఐలు పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండటం, కొత్తగా టారిఫ్ యుద్ధానికి ట్రంప్ తెరలేపడంతో గత నాలుగు సెషన్లలో మదుపరులు రూ.7.68 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. దీంతో బీఎస్‌ఈలో నమోదిత సంస్థల విలువ రూ.7,68,252.32 కోట్లు కరిగిపోయి రూ.4,17,82,573.79 కోట్లకు చేరింది.

88 దగ్గరదాకా..

ఆఖర్లో కోలుకున్న రూపాయి • 5 పైసలు పెరిగి 87.45 వద్ద ముగింపు



ముంబై, ఫిబ్రవరి 10: డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ సోమవారం తీవ్ర ఆటుపోట్లకు లోనైంది. ఒకానొక దశలో 50 పైసలు క్షీణించి 88 దరిదాపుల్లోకి దిగజారింది. ఆల్‌టైమ్ ఇంట్రా–డే కనిష్ఠాన్ని తాకుతూ 87.95 స్థాయిని చేరింది. అయితే ఆఖర్లో కోలుకున్నది. ఈ క్రమంలోనే చివరకు 5 పైసలు లాభపడి 87.45 వద్ద ముగిసింది. శుక్రవారం 87.50 దగ్గర ఆగిన విషయం తెలిసిందే. కానీ అంతకుముందు రోజు గురువారం మునుపెన్నడూ లేనివిధంగా 87.59 స్థాయికి పడిపోయి ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని చవిచూసింది. ఈ నేపథ్యంలో తాజా లాభాలతో వరుసగా రెండు రోజుల ట్రేడింగ్‌ల్లో 14 పైసలు లాభపడినట్టైంది. కాగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తమ దేశంలోకి దిగుమతయ్యే స్టీల్, అల్యూమినియంలపై 25 శాతం సుంకాలు వేయడం డాలర్‌ను బలపర్చింది. అమెరికాపై పరస్పర సుంకాలతో బదులిస్తున్న దేశాలపై ప్రతీకార సుంకాలకూ ట్రంప్ దిగుతున్నారు. ఇది అంతర్జాతీయ వాణిజ్య యుద్ధానికి దారితీస్తుందేమోనన్న భయాలు ఇప్పుడు వెంటాడుతున్నాయి. ఈ అంచనాలు కూడా రూపీని బలహీనపరుస్తున్నాయన్న అభిప్రాయాలు ఫారెక్స్ మార్కెట్ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

రిక్తమ్ ఏఐ ఆధారిత ఇంటర్వ్యూ సేవలు

హైదరాబాద్, ఫిబ్రవరి 10: హైదరాబాద్ ఆధారిత రిక్తమ్ గ్రూపు తాజాగా కృత్రిమ మేధస్సు(ఏఐ) ఆధారంగా ఇంటర్వ్యూ సేవలు అందించే టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. మానవ వనరుల విభాగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలనే ఉద్దేశంలో సరికొత్త టెక్నాలజీని పరిచయం చేసినట్లు ఇంటర్వ్యూ ఏఐ కో–ఫౌండర్, సీఈవో సిద్ధరామ్ శింగిషెట్టి తెలిపారు. ఈ సేవలతో ఇంటర్వ్యూ మరింత సులభతరం కానున్నదని, అలాగే సమయం ఆదా కానున్నదని ఆయన చెప్పారు.

చివరి రోజు నామినేషన్ల జోరు

నామినేషన్ పత్రాలు అందజేస్తున్న గ్రాడ్యుయేట్ అభ్యర్థులు నరేందర్ రెడ్డి, రవీందర్ సింగ్.. టీచర్ అభ్యర్థులు యాదగిరి శేఖర్‌రావు, సుహాసిని

కలెక్టరేట్, ఫిబ్రవరి 10 : కరీంనగర్– మెదక్– నిజామాబాద్– ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల నామినేషన్ల జాతర సోమవారం ముగిసింది. చివరి రోజు హోరెత్తింది. సోమవారం గ్రాడ్యుయేట్ స్థానానికి 51 మంది, టీచర్ స్థానానికి 8 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు వందలాది మంది అనుచరులతో తరలివచ్చి నామినేషన్లు దాఖలు చేశారు. అయితే రవీందర్ సింగ్ నామినేషన్ ర్యాలీలో ఓ అభిమాని, ఒగ్గు కళాకారులు కేసీఆర్ చిత్రపటంతో ప్రదర్శనలు ఇచ్చారు.

ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న గ్రాడ్యుయేట్ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ

ర్యాలీలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఫొటోతో ఓ అభిమాని

మహిళను హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదు

జగిత్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 26: మహిళను హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా జడ్జి నీలిమ సోమవారం తీర్పునిచ్చారు. సీఎంఎస్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్గటూర్ మండలం పాత గూడూరుకు చెందిన రెడ్డిపాక లత భర్త జీవనోపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లగా, ఇద్దరు బిడ్డలతో కలిసి గ్రామంలో ఉంటూ కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నది. అదే గ్రామానికి చెందిన బోయిని రమేశ్ 2021, జనవరి 7న అర్ధరాత్రి లత ఇంట్లోకి చొరబడి లైంగిక దాడికి యత్నించాడు. ఆమె కేకలు వేయడంతో గొంతు నులిమి హత్య చేసి పారిపోయాడు. మృతురాలి తల్లి మణెవ్వ ఫిర్యాదు మేరకు వెల్గటూర్ పోలీసులు కేసు నమోదు చేసి, సాక్ష్యాలను కోర్టులో సమర్పించారు. నేరం రుజువు కావడంతో రమేశ్‌కు జీవిత ఖైదుతో పాటు రూ. 25వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. నిందితునికి శిక్షపడేలా చేసిన ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్స్ ప్రేమ్‌కుమార్, కిశోర్, చామచందర్‌రావు, కోటేశ్వర్, కోర్టు కానిస్టేబుల్ శ్రీధర్, సీఎంఎస్ ఎస్ఐ శ్రీకాంత్, పీసీ కిరణ్‌కుమార్‌ను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

కార్యవర్గాన్ని అభినందిస్తున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు, ఉద్యోగులు

కార్యవర్గం

జగిత్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 10: ఆర్థిక గణాంక శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి ఊకంటి అమరేందర్‌రెడ్డి తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా సంపత్ కుమార్, కార్యదర్శిగా అశ్విని, కోశాధికారిగా శ్రీలత, ఉపాధ్యక్షురాలుగా శిరీష, కార్యనిర్వాహక కార్యదర్శిగా రాణాప్రతాప్, కార్యవర్గ సభ్యుడిగా నరేశ్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు మిర్యాల నాగేందర్‌రెడ్డి, కోశాధికారి సాహెబ్ బాబు, సహాధ్యక్షుడు మహమూద్, రామకృష్ణారెడ్డి, గజేంద్రప్రసాద్, మహేశ్, మధు, కవిత, దివ్య, సాయికుమార్, కిరణ్‌కుమార్, శ్రావ్య, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల, ఫిబ్రవరి 10: పట్టణంలోని గౌతమ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి మ్యాథ్స్, సైన్స్ ఒలింపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చారు. సైన్స్ విభాగంలో షేక్ ఫైజాన్ రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకు, మహ్మద్ ముదాసిర్ స్టేట్ 6వ ర్యాంకు, జిల్లా స్థాయిలో మొదటి, రెండో ర్యాంకులు జుహనాజ్, అరీబాహనూన్, అల్లె వెన్నెల, ఆరాధ్య సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ ఎంఏ గఫార్ తెలిపారు. విద్యార్థులను పాఠశాల నిర్వాహకుడు కీజర్, అధ్యాపకులు అఫ్రోజ్, గోపి మారసి, క్రిస్టినా అభినందించారు.

మేడిపల్లి, ఫిబ్రవరి 10: భీమారం మండలం గోవిందారం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి బండపల్లి జశ్వంత్ మహారాష్ట్రలో జరిగే ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ లక్ష్మీరాంనాయక్ సోమవారం తెలిపారు. జశ్వంత్‌ను ప్రధానోపాధ్యాయుడు అశ్ఫక్ హుస్సేన్, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రశాంత్ అభినందించారు. జశ్వంత్‌కు షూ, క్రీడా దుస్తులు అందజేశారు.

నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలి

మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, ఫిబ్రవరి 10: జిల్లాలో పీఎం శ్రీ (ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైసింగ్ ఇండియా) కింద ఎంపికైన పాఠశాలల్లో నిర్దేశిత అభివృద్ధి పనులను ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పీఎం శ్రీ పాఠశాలలపై సంబంధిత అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైసింగ్ ఇండియా పీఎం శ్రీ కింద 2 విడుతల్లో 16 పాఠశాలలను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీటిలో నిర్దేశిత మొదటి దశ అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే నెలలో జరిగే పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా కార్యాచరణ అమలు చేయాలన్నారు. సమావేశంలో డీఈవో డీ మాధవి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల నాణ్యత నివేదిక అందించాలి

భూగర్భ జలాల నాణ్యతను పరీక్షించి నివేదిక అందించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సంచార నీటి నాణ్యత ప్రయోగశాల వాహనాన్ని కలెక్టర్ పరిశీలించారు. నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టు కింద భూగర్భ జలాల నాణ్యత విశ్లేషణ కోసం ఏర్పాటు చేసిన సంచార నాణ్యత ప్రయోగశాల (మొబైల్ క్వాలిటీ ల్యాబ్ ఆన్ వీల్స్)ను సమర్థవంతంగా వినియోగించుకొని నీటి నాణ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలి అధికారులకు సూచించారు. రామగుండం పరిసర ప్రాంతాలు, ఎస్సారెస్పీ ఆయకట్టు ప్రాంతంలో భూగర్భ జలాల నాణ్యతపై అధ్యయనం చేసి నివేదికల సమర్పించాలని ఆదేశించారు. ఇక్కడ జిల్లా భూగర్భ జలాల అధికారి జీ లావణ్య, హైడ్రాలజిస్టు సీహెచ్ వేణు, జియాలజిస్టు సుజాత, సిబ్బంది ఉన్నారు.

మట్టి, మొరం తీసుకునేందుకు అనుమతి

సామాన్య ప్రజలకు సొంత అవసరాల కోసం అవసరమైన మట్టి, మొరం తీసుకునేందుకు తహసీల్దార్ల ద్వారా అతి తక్కువ ధరకు అనుమతి మంజూరు చేయనున్నట్లు కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు సొంత ఇండ్ల నిర్మాణానికి అవసరమైన మట్టి, మొరం సరఫరాకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకున్నామని వివరించారు. మట్టి, మొరం తీసుకునేందుకు ట్రాక్టర్‌కు రూ.200, టిప్పర్‌కు రూ.800 రుసుం తహసీల్దార్‌కు చెల్లించి అనుమతి పొందాలని వివరించారు. మట్టి సొంత అవసరాలకు మాత్రమే వాడాలని, ఎక్కడా డంప్ చేయటానికి వీలు లేదని స్పష్టం చేశారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే మట్టి తరలించాలని పేర్కొన్నారు. ఆదివారం, సెలవు దినాల్లో తరలింపునకు అనుమతి లేదని స్పష్టం చేశారు.

శుభకార్యానికి మాజీ మంత్రి హాజరు

పెగడపల్లి, ఫిబ్రవరి 10: పెగడపల్లి మండలం నందిగిరి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నారెడ్డి రాజిరెడ్డి కూతురు మౌనిక–వినయ్‌ల నిశ్చితార్థం సోమవారం కరీంనగర్‌లో జరిగింది. ఈ శుభకార్యక్రమానికి మాజీ మంత్రి ఈశ్వర్ హాజరై కాబోయే జంటను ఆశీర్వదించారు. అలాగే, ఈ శుభకార్యానికి నంచర్ల, నందగిరి సింగిల్ విండో చైర్మన్లు వేణుగోపాల్, భాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్లారెడ్డి, దుద్దిళ్ల శ్రీనుబాబు హాజరయ్యారు.

విలాసాల కోసమే మేకల చోరీ

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 10 : విలాసాల కోసం అడ్డదారులు తొక్కి, చివరకు కటకటాల పాలయ్యారు. మేకలను దొంగలించి అడ్డంగా దొరికిపోయారు. కాల్వశ్రీరాంపూర్ ఎస్ఐ వెంకటేశ్ వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన మానుపాటి శేఖర్, కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేటకు చెందిన శివరాత్రి రమేశ్, చొప్పదండికి చెందిన మానుపాటి సంజీవ్‌కుమార్‌తో పాటు మరికొంత మంది కలిసి అప్పుడప్పుడు మద్యం పార్టీలు చేసుకునేవాళ్లు. వీరంతా విలాసాల కోసం రాత్రి పూట ఇళ్లలో దొంగతనాలు చేయాలని పథకం వేశారు. ఈ నెల 2న రెండు కార్లు, బొలేరో క్యాంపర్ వ్యాన్‌లో అర్ధరాత్రి కాల్వశ్రీరాంపూర్‌కు వెళ్లారు. ఆ రోజు పొద్దంతా అక్కడే గడిపారు. 3న అర్ధరాత్రి సమయంలో తిప్పనవేన ఎర్ర కొమురయ్య ఇంటి కాంపౌండ్ గోడ దూకారు. మేకల కొట్టం నుంచి మూడు మేకలను దొంగిలించి, వారి వాహనాల్లో ఎక్కించుకున్నారు. తర్వాత మల్యాల గ్రామానికి వెళ్లి బొల్లి రాజయ్య మేకల కొట్టం నుంచి రెండు మేకలను తమ వాహనాల్లో ఎక్కించుకొని పారిపోయారు. చొప్పదండి చేరుకున్న తర్వాత ఐదు మేకలను సంజీవ్‌కుమార్ కొట్టంలో ఉంచారు. ఈ నెల 9న మళ్లీ దొంగతనం చేద్దామనుకొని రమేశ్, సంజీవ్‌కుమార్ కొత్త కారులో కాల్వశ్రీరాంపూర్‌కు వెళ్తున్నారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు గంగారం క్రాస్ రోడ్డు వద్ద నిందితులను పట్టుకున్నారు. అనంతరం చొప్పదండికి వెళ్లి, ఐదు మేకలను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నిందితులు పరారీలో ఉండగా, అదుపులోకి తీసుకున్న నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలి

మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, ఫిబ్రవరి 10: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ఆయన అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి యాసంగి వరి ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమర్థవంతమైన ప్రణాళిక రూపొందించి, రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



దవాఖానలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్

బస్తీ దవాఖాన తనిఖీ

రాయికల్, ఫిబ్రవరి 10: రాయికల్ పట్టణంలోని బస్తీ దవాఖాన, ఆరోగ్య ఉప కేంద్రాన్ని సోమవారం జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్ పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో సాగర్ రావు, పర్యవేక్షకులు ఇల్లెందుల శ్రీనివాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కవర్లు విక్రయించవద్దు

కోరుట్ల, ఫిబ్రవరి 10: నిషేధిత ప్లాస్టిక్ కవర్లు విక్రయించే దుకాణాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి హెచ్చరించారు. పట్టణంలోని పలు కిరాణా షాపుల్లో సోమవారం ఆయన మున్సిపల్ అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వం నిషేధించిన సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ కవర్లను అధికారులు స్వాధీనం చేసుకొని, వ్యాపారులకు రూ. 16 వేల జరిమానా విధించారు. దుకాణాదారులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే షాపులు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

దుకాణాదారుడికి జరిమానా రసీదు ఇస్తున్న అధికారులు